International Journal of Enhanced Research in Educational Development (IJERED)
ISSN: 2320-8708, Vol. 9 Issue 2, March-April, 2021, Impact Factor: 7.326

తెలంగాణ స్వాప్నికుని సంభాషణ – 'వొడువని ముచ్చట'

Dr. V. Shankaraiah

Asst Professor of Telugu , Govt. Arts and Science College Kamareddy. Dist. Kamareddy. Telangana

---

తెలంగాణ అస్తిత్వ చైతన్యానికి ప్రతీక, తిరుగులేని ప్రతినిధి ఆచార్య కొత్తపల్లి జయశంకర్. ప్రజల ఆకాంక్షకు సైద్ధాంతిక రూపం కల్పించి, తెలంగాణవాదానికి పర్యాయపదంగా నిలిచిన మహోన్నతుడు ఆయన. రాష్ట్ర సాకారానికి బాటలు వేసిన జయశంకర్ తన 76 ఏళ్ల జీవితంలో 60 ఏళ్లు తెలంగాణ కోసమే తపించారు. అందువల్లనే ఆయనను తెలంగాణ ప్రజలు 'జాతిపిత'గా 'సిద్ధాంతకర్త'గా తమ గుండెల్లో ప్రతిష్టించుకున్నారు. తనకు జన్మనిచ్చిన సమాజం యొక్క ఆకాంక్ష కోసం మొత్తం జీవితాన్ని వెచ్చించిన వ్యక్తులలో ఇటీవలి చరిత్రలో జయశంకరే ముఖ్యులుగా కనిపిస్తారు. ఆయన అనుపమాన యోగదానంతో అందరికీ ప్రాతఃస్మరణీయుడు, మార్గదర్శి అయినారు.

1934 ఆగస్టు 8 న పూర్వ వరంగల్లు జిల్లాలోని అక్కంపల్లిలో లక్ష్మీకాంతరావు, మహాలక్ష్మి దంపతులకు జన్మించిన జయశంకర్ అంచెలంచెలుగా ఎదిగారు. పాఠశాల విద్య ఉర్దూ మీడియంలో చదువుకున్నారు. ఆర్థికశాస్త్రంలో ఎమ్మే, పి.హెచ్ డి. పూర్తిచేశారు. ఉర్దూ, ఆంగ్లం, హిందీ భాషలపై పట్టు సాధించారు. తెలుగు సాహిత్యాన్ని కూడా అధ్యయనం చేశారు. విద్యావేత్తగా, ఉద్యమ కార్యకర్తగా సాటిలేని కీర్తి సంపాదించుకున్నారు. తెలంగాణ ప్రాంతం మీద విపరీతమైన ప్రేమ పెంచుకున్నారు. ఆ ప్రేమతోనే పరుల పెత్తనం నుంచి విముక్తి పొంది తెలంగాణ స్వయంపాలనలో భారతదేశంలో ఆదర్శ రాష్ట్రంగా వెలగాలని కలలు కన్నారు. దురదృష్టవశాత్తూ చూస్తానన్న తెలంగాణ చూడకుండానే వెళ్ళిపోయారు.

సాధారణ ఉపాధ్యాయునిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్ గా, రిజిస్ట్రార్ గా, వైస్ ఛాన్సలర్ గా ఒక్కో మెట్టు అధిగమించారు. ప్రతి దశలోనూ పరిణతి గల ఆచార్యునిగా, పాలనాదక్షునిగా ఉన్నత విలువలు పాటించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. తాను నిర్దేశించుకున్న స్వీయ క్రమశిక్షణను ఎప్పుడూ అతిక్రమించలేదు. ఆయన జీవిత ప్రయాణాన్ని విద్యార్థి, ఉద్యోగి, విశ్రాంత ఉద్యోగి అని మూడు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి రెండు దశల్లో తెలంగాణ అంతర్లీనంగా సాగితే మూడో దశలో తెలంగాణే ఏకైక లక్ష్యంగా మారింది.

ఆయనలో మనం గమనించవలసిన మరో కోణం ఉంది. అది విశిష్టమైన మానవీయ కోణం. వ్యక్తిగా ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా అత్యంత సాధారణంగా, పారదర్శకంగా, హుందాగా, ఆత్మస్థైర్యంతో నడచుకోవడం. అదే అయన ప్రతి మాటకు, రాతకు, చేతకు ఎవరికీ లేని విశ్వసనీయతను సమకూర్చి పెట్టింది.

'వొడువని ముచ్చట'

అంతటి నిబద్ధత, విలువలు పాటించిన మహనీయుని జ్ఞాపకాలు సమకాలీన చరిత్రకు నమ్మకమైన వ్యాఖ్యానాలు అవుతాయి. నిజాయితీపరుని నిష్పాక్షిక విశ్లేషణే అందరూ ఆమోదించే చరిత్రగా మారుతుంది. ఆచార్య జయశంకర్ 'వొడువని ముచ్చట' అలాంటిదే. ఇది ఆయన జ్ఞాపకాల కూర్పు. తెలంగాణతో జయశంకర్ పెనవేసుకున్న అనుభవాలు, జీవిత విశేషాల సంపుటి. కొంపెల్లి వెంకట్ గౌడ్ సంపాదకుడు. జూలై 2011లో మొదటిసారి పుస్తకంగా వెలువడి, విశేష పాఠకాదరణతో ఏడాది కాలంలోనే 5 ముద్రణలు పొందింది. ఇందులో మొత్తం 74 ముచ్చట్లు ఉన్నాయి. ప్రతి ముచ్చట అమూల్యమైనదే. పాఠకునిలో స్ఫూర్తి నింపేదే. 180 పేజీలున్న ఈ పుస్తకం ఆసాంతం స్వచ్ఛమైన తెలంగాణ భాషలో సాగుతుంది. పుస్తకం చివర జయశంకర్ ప్రొఫైల్, ఆయన జీవిత ప్రస్థానంలోని విశేషాలు, అరుదైన ఫోటోలను 'రవానీ' పేరుతో పొందు పరిచారు. ఇవి ఆయనకు ప్రముఖులతో గల సంబంధాలు, వ్యక్తిగా ఆయన చేరుకున్న శిఖరాలు తెలుపుతాయి. సంపాదకుడు 'సారు'ను దశలవారీగా పలుమార్లు ఇంటర్వ్యూలు చేసి, విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఇందులో పొందుపరిచారు. ఆ పొందుపరచడంలోనూ నైపుణ్యం కనిపిస్తుంది. భాష, భావం విషయంలో సంపాదకుడు సొంత ప్రయోగాలకు పోలేదు.

వొడువని ముచ్చట చదువుతున్నంత సేపూ ఆచార్య జయశంకర్ మనల్ని పక్కన కూచోబెట్టుకుని తనదైన శైలిలో ఒక్కో ముచ్చటను ఒలిచి పెడుతున్న అనుభూతికి లోనవుతాము. అరవై ఏండ్ల తెలంగాణా చరిత్ర సినిమా రీల్ లాగా మన కండ్లముందు కదలాడుతుంది. మనమూ ఆ ముచ్చట్ల ఒరవడిలో భాగమవుతాము. వాటిని ఒడిసిపట్టుకున్న అక్షరాల ప్రవాహం వెంట మన కండ్లు ఆగకుండా పరుగులు తీస్తాయి. తెలంగాణ భాషలోనే ఉన్నా ఈ ముచ్చట్లలో ఇంగ్లీష్ పదాలు కూడా అధికంగానే దొర్లుతాయి. అయినా చదవటంలో ఎటువంటి క్లిష్టత ఉండదు. విషయంలో భేషజం, సందిగ్ధం ఉండదు. అంతా ఖుల్లం ఖుల్ల. ఇందులోని విషయాలు తెలంగాణవాదులకే కాక బుద్ధిజీవులందరినీ ఆకట్టుకుంటాయి. ఆసాంతం చదివిస్తాయి.

'వొడువని ముచ్చట' తెలంగాణ ఆత్మ మనతో సంభాషించినట్లుగా కూడా ఉంటుంది. ఇటీవలి చరిత్ర, స్వరాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం, అందులో ఎదురైన ఆటుపోట్లు, వ్యూహాలు, ప్రతివ్యూహాలు అన్నిటినీ కండ్లముందు నిలుపుతుంది. నిఖార్సైన ఒక ఉద్యమ కార్యకర్త గొంతులో తెలంగాణ ఆరాట పోరాటాలను దర్శింపజేస్తుంది. అంతేగాకుండా ప్రాంతీయ సమ న్యాయం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువలు, వాటి ప్రాతిపాదికగా ఉద్యమాల నిర్మాణం, అవి లక్ష్యాలు సాధించే మార్గాలు వంటి ఎన్నో అంశాల మీద స్పష్టమైన అభిప్రాయయాలు తెలియజెప్పారు జయశంకర్. ఆ అవగాహనతోనే తెలంగాణ కోసం ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ ఎస్ యు వరకు ఒకే లక్ష్యం కోసం కలిసి నడిచేటట్లు కృషి చేశారాయన. అందువల్ల ఒక మేధావి ఆత్మీయ భాషణం ఈ పుస్తకంలోని ప్రతి ముచ్చటలోనూ ఆర్ద్రంగా పరచుకొని ఉన్నది. ఇందులో తెలంగాణ ఉద్యమ గమనంలో ఆయనకు ఎదురైన అనుభవాలే కాక తన జీవిత విశేషాలను పొరలు పొరలుగా విప్పి చెప్పినారు. వాటిద్వారా ఎన్నో విషయాలు తెలుస్తున్నాయి.

ఆరంభదశ

జయశంకర్ కు విద్యార్థి దశలోనే తెలంగాణ ఆకాంక్ష అంకురించింది. 1952లో విద్యార్థి సంఘ నాయకునిగా 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' ఉద్యమంలో పాల్గొన్నారు. ఫజల్ అలీ నేతృత్వంలోని మొదటి రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్ కు తెలంగాణ రాష్ట్రం కోసం నివేదించారు. 1969 లో వచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పటి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య రావాడ సత్యనారాయణ సూచించినట్లుగా విద్యావంతులు తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను అధ్యయనం చేయాలనే పిలుపునందుకున్నారు. అది స్ఫూర్తిగా ఎన్నో వ్యాసాలు రచించారు. ఇక 1996 నుంచి తెలంగాణను ఒక పాఠశాల గా చేసుకొని భావజాల వ్యాప్తికి తెలంగాణ మూలమూలలా పర్యటించారు.

సిద్ధాంతకర్త, జాతిపిత

మలిదశ తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ చేస్తున్న కృషిని గుర్తించిన ఇంగ్లీష్ మీడియా ఆయనను 'ఐడియలోగ్' అని రాసింది. దాని సమానార్థకంగా తెలుగు మీడియా ఆయనను 'సిద్ధాంతకర్త' అనే విశేషణం జోడిస్తూ ప్రస్తావించింది. ప్రజల్లోనూ ఆయనకు తెలంగాణ సిద్ధాంతకర్తగా విశేషమైన గుర్తింపు వచ్చింది. కానీ ఆయన మాత్రం తాను ఉద్యమంలో ఒక 'స్వచ్ఛంద కార్యకర్త'ను మాత్రమే అని చెప్పుకున్నారు.

మరో ముచ్చట. తెలంగాణ సమాజం ఆయన నిస్వార్థ, నిర్విరామ కృషికి తెలంగాణ 'జాతిపిత' అని సంబోధిస్తూ గౌరవించింది. దానికి కూడా ఆయన పొంగిపోలేదు. తనదైన చమత్కారంతో సున్నితంగా తిరస్కరించారు. 'జాతిపిత కావాలంటే ముందు పిత కావాలె. పిత కావాలంటే పతి కావాలె. నేను పతినే కాలేదు. పితనేట్లయిత, జాతిపితనెట్లయిత' అన్నారు. ఇది ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని తెలిపే విషయం.

భావజాల వ్యాప్తి, దార్శనికత

జయశంకర్ కేవలం తెలంగాణ భావజాల వ్యాప్తి తోనే సరిపెట్టుకోలేదు. తెలంగాణ కోసం సంస్థల స్థాపన, ఏకీకరణ కోసం ఎంతో శ్రమించారు. ప్రతిరోజు అధ్యయనం, రచనలు, ప్రసంగాల ద్వారా తెలంగాణ నినాదాన్ని సజీవంగా ఉంచారు. యూనివర్సిటీలు, జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద తెలంగాణ వాణి వినిపించారు.

ఉద్యమ లక్ష్యం పట్ల ఆయనకు స్పష్టత ఉంది. 1969లో ఎక్కడ విఫలమైనామో జయశంకర్ మలిదశ ఉద్యమం అక్కడ ప్రారంభింపజేశారు. ఉద్యమం విజయవంతం కావాలంటే మూడు రకాల కార్యక్రమాలు జరగాలని ఆయన భావించారు. మొదటిది భావజాల వ్యాప్తి. రెండవది ఆందోళన కార్యక్రమాలు. మూడవది రాజకీయ ప్రక్రియ. ఈ మూడు సమన్వయంతో ముందుకు సాగితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఖచ్చితంగా జరుగుతుందని ఆయన నమ్మకం. ఆ

నమ్మకం నిజమైంది కూడా. కె చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పెట్టిన తర్వాత ఆయనకు మార్గదర్శిగా ఉండి తెలంగాణ లక్ష్యం వైపు నడిపించారు. అంతమాత్రాన ఆయన పార్టీలో చేరలేదు. తెలంగాణ కోసం ఎవరు పని చేస్తే వారికి బాసటగా నిలిచారు. 2000 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ కోసం ప్రణబ్ ముఖర్జీ కమిటీ వేస్తే ఆ కమిటీ ముందు 200 మంది రాష్ట్ర, జాతీయ నాయకుల ముందు రెండున్నర గంటల పాటు తెలంగాణ ఆవశ్యకత గురించి వాదించారు. అంతేకాదు, ఏ పార్టీ వారు పిలిచినా వెళ్లి తెలంగాణ అవసరాన్ని సాధికారిక సమాచారంతో వివరించి చెప్పేవారు. అందుకు ఎప్పటికప్పుడు అధ్యయనం చేసేవారు. ఈ అకాడమిక్ వర్క్ ను ఆయన మండుగుండుతో పోల్చిన్నారు. ' డైరెక్షన్ తప్పొచ్చు. అయినా మందుగుండు తయారు చేయడం మానుకోము గద' (పుట;39) అంటారు.

జయశంకర్ ఏ విషయంలోనైనా స్పష్టంగా, పారదర్శకంగా, ప్రజాస్వామికంగా నడుచుకునే వారు. అది ఉద్యోగ జీవితమైనా, ఉద్యమ సందర్భమైనా ఎలాంటి మార్పు ఉండదు. తెలంగాణ రాష్ట్ర సమితి సమావేశాలకు వెళ్లినా ఆటోలోనే ప్రయాణించేవారు. కెసిఆర్ వాహనం పంపినా సున్నితంగా తిరస్కరించేవారు. రాజకీయ ఒడిదుడుకుల సందర్భంగా కొందరు ఉద్యమకారులు జయశంకర్ ను 'కేసీఆర్ నుంచి బయటకు రా' అని విమర్శిస్తే 'నేను లోపల ఉంటే కదా బయటకు వచ్చేది. బయటనే ఉన్న గద, లోపల ఎక్కడున్న' (పుట;25) అని చిరునవ్వుతో సమాధానమిచ్చారు.

అలాగే మరొక సందర్భంలో జయశంకర్ మేధావి అనే పదానికి ఇచ్చిన నిర్వచనం అందరినీ ఆలోచింపజేస్తుంది. ఉద్యమ వ్యూహాల సందర్భంగా జయశంకర్ చెప్పిన మార్గం నచ్చకుండా, అది కేసీఆర్ కు రాజకీయంగా ఉపయోగపడేలా ఉంటే కొందరు -'మేధావులు ఇట్లా చేస్తే ఎట్లా సార్? అని సారును ప్రశ్నించారు. దానికి ఆయన సమాధానం అద్భుతమైన వ్యాఖ్యానంలా ఉంది. 'నన్ను నేను మేధావిని అనుకోవడం లేదు. ఇది మొదటిది. రెండోది ఏందంటే చదువుకున్న ప్రతివాడు మేధావి కాదు. ప్రతి మేధావి చదువుకోనక్కరలేదు. అదొక క్వాలిటీ ఆఫ్ మైండ్' (పుట;68) అని నిర్వచించారు. అంతేకాదు సీఫెల్ రిజిస్ట్రార్ గా ఉన్నా సొంతంగా వంట చేసుకున్నారు. ప్రధానమంత్రి అధ్యక్షతన గల సంస్థలో సభ్యుడుగా కేంద్ర కేబినేట్ హోదాలో ఉన్నా బంగ్లా, సౌకర్యాలు తీసుకోకుండా ఆ పదవిని తెలంగాణా కోసం వినియోగించడం, పని పూర్తి కాగానే రాజీనామా చేయడం ఆయనకు తన లక్ష్యం పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుంది.

తెలంగాణ విషయమై ఎదుటివారికి కటువుగా అనిపించే విషయాలు కూడా చాలా మృదువుగా చెప్పడంలో జయశంకర్ దిట్ట. తెలంగాణవాదం విషయంలో ఆయన చెప్పిన విషయాలను ప్రధానమంత్రితో పాటు ముఖ్యమంత్రులు కూడా ఖండించలేకపోయారు. తెలంగాణ వ్యతిరేకులు సైతం ఇది సత్యం అన్నంత సాధికారికంగా జయశంకర్ విషయాన్ని విశదపరిచేవారు.

మలిదశ ఉద్యమ సందర్భంగా నిజామాబాదులో 1996 అక్టోబర్ 27న లాయర్ల సమావేశం జరిగింది. జయశంకర్ పాల్గొని రోజంతా న్యాయవాదులతో తెలంగాణ ఆవశ్యకత గురించి చర్చించారు. 1996 నవంబర్ 1న భూపతి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా సమితి వరంగల్ లో ఒక సమావేశం ఏర్పాటు చేసింది. 200 మంది మాత్రమే కూర్చునే ప్రాంగణం. కానీ ఆ సభకు ఐదు వేల మంది విద్యావంతులు, ప్రజలు హాజరైనారు. జస్టిస్ మాధవరెడ్డి, కాళోజి, జయశంకర్ పాల్గొన్నారు. అంతకుముందు నుంచే ప్రతి ఏటా నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినాన్ని నిరసన దినంగా తెలంగాణ వాదులు జరుపుకునేవారు. వరంగల్లు సభ విజయవంతమైన ఆనాటి సమావేశం వార్తలు తెలుసుకుని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 'వేర్పాటువాదాన్ని ఉక్కు పాదంతో అణచి వేస్తా' నని ప్రకటించారు. అది తెలంగాణా వాదులకు ఆగ్రహం కలిగించడమే కాక మరింత దృఢంగా పనిచేసేలా పురికొల్పింది.

తర్వాత కాలంలో మల్లేపల్లి వెంకటరాజ్యం మెమోరియల్ లెక్చర్ సందర్భంగా ఆచార్య జయశంకర్ తెలంగాణవాదంపై కొన్ని నోట్స్ తయారు చేశారు. అది 'తెలంగాణలో ఏం జరుగుతోంది' అనే పేరుతో పుస్తకంగా కూడా వచ్చింది. అది విద్యావంతులను ఆలోచింపజేసింది. తెలంగాణవాదం వైపు ఆకర్షించింది. 1999లో అమెరికాలో కొందరు తెలంగాణ వాదులు ఒక మీటింగ్ ఏర్పాటు చేశారు. న్యూయార్క్ లో రోజంతా జరిగిన ఆ సమావేశంలో జయశంకర్ తెలంగాణ గురించి మాట్లాడడంతో పాటు పాల్గొన్నవారి సందేహాలకు సమాధానాలిచ్చారు. ఫలితంగా అమెరికాలో 'తెలంగాణ డెవలప్ మెంట్ ఫోరం' రూపుదిద్దుకున్నది. 2000 సంవత్సరంలో అక్కడివారు సారును మళ్లీ పిలిపించుకొని అమెరికాలోని పది పట్టణాల్లో సమావేశాలు ఏర్పాటు చేశారు. జయశంకర్, బియ్యాల జనార్ధన్ రావుతో కలిసి అమెరికా వెళ్లి తెలంగాణ భావజాల వ్యాప్తికి, అందుకు అమెరికాలో స్థిరపడ్డ తెలంగాణ వాసుల మద్ధతు విషయమై సమాయత్తం చేశారు.
క్రమంగా తెలంగాణ వాదానికి మద్ధతు పెరిగింది. కాంగ్రెస్ అధిష్ఠానం ప్రణబ్ ముఖర్జీ నేతృత్వంలో ఒక కమిటీ వేశారు. ఆ కమిటీ ముందు తెలంగాణ ఆవశ్యకతపై రెండున్నర గంటల పాటు వాదించారు జయశంకర్. తర్వాత కెసిఆర్ తో

చర్చించారు. కె చంద్రశేఖర రావు కొన్నివేల గంటల పాటు అధ్యయనం చేసి తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుచేశారు. అయితే జయశంకర్ కెసిఆర్ లో ఉద్యమ కోణాన్ని మాత్రమే చూశారు. జయశంకర్ ఒక విషయాన్ని అక్కడ అకడమిక్ గా చెబితే, దాన్నే కెసిఆర్ పొలిటికల్ గా చెప్పేవారు. ఆయన కేసీఆర్ ను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరగవలసిన రాజకీయ ప్రక్రియకు ఒక సాధనంగా మాత్రమే చూశారు. అలాగే డిసెంబర్ 23 ప్రకటన పర్యవసానంగా ఏర్పడ్డ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటీ (జే.ఎ.సి.) కన్వీనర్ గా ఆచార్య కోదండరాం పేరు సూచించడం కూడా అటువంటి లక్ష్యసాధన కోసమే.

మన్మోహన్ సింగ్ తో పరిచయం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ గా ఉన్నప్పుడే జయశంకర్ కు పరిచయం. తాను పనిచేసే కాకతీయ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రంలో పరిశోధనకు రిజర్వు బ్యాంకు నిధులు మంజూరు చేయించారు. మన్మోహన్ సింగ్ యూజీసీ చైర్మన్ గా ఉన్నప్పుడు జయశంకర్ ను చాలా కమిటీల్లో సభ్యునిగా నియమించారు. పీవీ నరసింహారావు మంత్రివర్గంలో ఆర్థిక మంత్రిగా పనిచేసిన సమయంలో జయశంకర్ కాకతీయ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ గా ఉన్నారు. తనకున్న పరిచయంతో మన్మోహన్ సింగ్ ను 1992లో జరిగిన యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా రప్పించారు. అలాగే ప్రణబ్ కమిటీలో మన్మోహన్ సింగ్ కూడా ఒక సభ్యుడు. కాంగ్రెస్ తరపున రాజ్యసభ సభ్యత్వం తీసుకొమ్మని అడిగితే తెలంగాణ కోసం వదులుకున్నారు జయశంకర్. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి అయిన తర్వాత నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్ప్రైజెస్ ఫర్ రూరల్ ఆర్గనైజేషన్ సభ్యునిగా జయశంకర్ ను నియమించారు. అప్పుడు కూడా జయశంకర్ ప్రధానమంత్రితో ఈ పదవి నా తెలంగాణ యాక్టివిటీకి అడ్డు రాకూడదు' అన్నారు. దానికి ప్రధాని 'చూడు, యాక్టివిటీ కి ఏం అడ్డం రాదు. ఒకటే భారత ప్రభుత్వాన్ని తిట్టినప్పుడు గట్టిగా తిట్టకు' అని కోరారు.

మన్మోహన్ సింగ్ ప్రధాని అధ్యక్షతన పనిచేసే కేంద్ర కమిటీ లో సభ్యునిగా బంగ్లా సౌకర్యాలు తీసుకోలేదు. కానీ ఆ పదవి సాయంతో ప్రధానమంత్రి, ఏఐసిసి అధ్యక్షురాలు సోనియా గాంధీని కలిసేది. తెలంగాణ గురించి చర్చించేది. దానికి కొందరు 'జయశంకర్ లొంగిపోయాడు' అని విమర్శించినా ఆయన ఎవరికి బదులివ్వలేదు. పదవి వల్ల లభించిన వెసులుబాటును ఆయన తెలంగాణ కోసమే వాడుకున్నారు.

తెలంగాణ రాష్ట్రం పార్లమెంటు చట్టం ద్వారా మాత్రమే ఏర్పడుతుంది. కనుక దేశంలోని రాజకీయ పార్టీల మద్దతు అవసరం. అందుకోసం దేశంలోని అన్ని పార్టీలకు జయశంకర్ స్వయంగా లేఖలు రాశారు. చాలా వాటికి ఆ పార్టీల సమాధానాలు కూడా ఆయనే రాశారు. తెలంగాణ గురించి తెలియకపోయినా కొన్ని ఉత్తరాది పార్టీలవారు ఆయన చెప్పిన విషయాలు విని 'నిజమే ఇందులో న్యాయం ఉంది. రాజ్యాంగ బద్ధత ఉంది. కనుక మేము మద్దతు తెలుపుతున్నాం' అని వారిచేత ప్రకటించేలా కృషి చేశారు. అప్పుడు ప్రధాన ప్రతిపక్షం భారతీయ జనతా పార్టీ. దాని జాతీయకార్యవర్గం తెలంగాణకు అనుకూలంగా తీర్మానం చేసిన తర్వాత జయశంకర్ తన పదవికి రాజీనామా చేశారు. 'ధిల్లీ వచ్చిన పని అయిపోయింది. ఇక అక్కడ ఉండవలసిన అవసరం లేద'ని హైదరాబాదుకు వచ్చారు. ఈ రకంగా తెలంగాణ సాధన కోసం పల్లె నుంచి అమెరికా వరకు, స్థానిక పార్టీల నుంచి జాతీయ పార్టీల వరకు మద్దతు కూడగట్టారు. పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తీర్మానానికి అవసరమైన సంపూర్ణమైన మద్దతు సంపాదించారు. ఇవన్నీ పూసగుచ్చినట్లు 'వొడువని ముచ్చట'లో వివరించారు ఆచార్య జయశంకర్.

ఈ ముచ్చట్లలో తెలంగాణ భావజాల వ్యాప్తి, రాష్ట్ర సాధన కోసం తాను చేసిన కృషితో పాటు వివిధ సామాజికాంశాల మీద తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. తెలంగాణలో ఉన్న సామాజిక నిర్మాణం దృష్ట్యా ఇక్కడ కారంచేడు, పదిరికుప్పం, వేంపేట లాంటి ఘర్షణలకు అవకాశం లేదన్నారు. అంతేకాదు బీసీలలో ఐక్యత లేకపోతే హక్కులు సాధించుకోవడం వీలు కాదని స్పష్టం చేశారు. బీసీలలోనూ 34 కులాలు మాత్రమే అధికారంలో భాగస్వాములు అవుతున్నారని, ఇతర కులాలను పట్టించుకోవాలని, అందుకు మిగిలినవారు సంఘటిత శక్తిగా మారితేనే సాధ్యమని సూచించారు.

ప్రజాస్వామ్యవాది

జయశంకర్ మొదటినుంచి ప్రజాస్వామిక వాది. కాళోజి శిష్యరికంలో ఆరితేరిన వ్యక్తి. నిజాం కాలంలోనే పాఠశాల విద్యార్థిగా అప్పుడు నిషిద్ధ పదమైన 'వందేమాతరం' అని నినదించారు. అప్పటి హెడ్మాస్టర్ కూడా ఆయనను సమర్థించి అప్పటి పరిస్థితుల దృష్ట్యా నడుచుకోవాల్సిన పద్ధతులు చెప్పినారు. విద్యాసంస్థల్లో 'ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్ప్రెషన్' ఉండాలని జయశంకర్ కోరుకున్నారు. ఏ తరంలో అయినా పూర్తిగా మంచి ఉండదు. పూర్తిగా చెడు ఉండదు. మంచి చెడు రెండూ ఉంటాయి. మంచిని మాత్రమే స్వీకరించి ముందుకు సాగాలి అని మార్గదర్శనం

చేస్తారు. అది జయశంకర్ సూచించిన మార్గం. ఆయన తెలంగాణవాది మాత్రమే కాదు. ప్రజాస్వామిక వాది. మానవతావాది. పౌర హక్కుల కోసం జరిగిన అన్ని ఉద్యమాలతోనూ సన్నిహితంగా ఉన్నారు. ఆధునిక కాలంలో జయశంకర్ లాంటి ఉదారుడు, కర్మయోగి, నిస్వార్థపరుడు మరొకరు ఉండరు. ఒక లక్ష్యం కోసం తన భౌతిక సుఖాలను త్యాగం చేసి, సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు జయశంకర్ అని ఈ 'ముచ్చట్లు' నిరూపిస్తాయి. ఇవి భాషలోనూ, భావంలోనూ తెలంగాణ మట్టి మనిషి గుండెలోతుల్లోంచి ఉబికి వచ్చిన జ్ఞాపకాల ప్రవాహం. వీటిని చదువుతుంటే తెలంగాణ అస్తిత్వ పరిమళాలు మనసంతా కమ్ముకుంటాయి.

ఒక కర్మయోగిగా జీవితాంతం తెలంగాణా కోసం తపించిన ఈ ఆచార్యుని తెలంగాణ ప్రజ 'జాతిపిత' అని గౌరవించింది. హిమాలయమంత ఎత్తైన ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని ఈ పుస్తకం అద్దంలో కొండలా చూపుతుంది. కాళోజి చెప్పినట్టు 'పుటుక నీది చావు నీది, బతుకంతా దేశానిది' అన్నమాటలు ఆచార్య జయశంకర్ కు అక్షరాలా వర్తిస్తాయి. అందుకు ఈ 'ఎడువని ముచ్చట' తిరుగులేని దాఖలా!

ఉపయుక్తగ్రంథాలు

1. ఒడువని ముచ్చట- కొంపల్లి వెంకట్
2. తెలంగాణా రాష్ట్రం – ఒక డిమాండ్ – ఆచార్య కొట్టాల్లి జయశంకర్